# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **భూగర్భ జలాలను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు.**

2. **తిరుమలకు వచ్చే భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీస్ శాఖ అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటోందన్న హోంమంత్రి వంగలపూడి అనిత.**

3. **దేశ నీటి పారుదల రంగంలో కె.ఎల్.రావు చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు..**

4. **అంతర్జాతీయ పురావస్తు ప్రదర్శనశాలల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.**

==========================

భూగర్భ జలాలను సమర్థవంతంగా వినియోగించుకునేలా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులు, పోలవరం ప్రాజెక్టు పురోగతిపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి ఈరోజు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన జలవనరుల క్యాలెండర్‌కు అనుగుణంగా అన్ని ప్రాజెక్టులు నిర్దేశిత గడువులోపు పూర్తి కావాలని ఆదేశించారు. నీటి నిర్వహణలో సాగునీటి సంఘాలతో పాటు ప్రజల భాగస్వామ్యాన్ని కూడా తీసుకురావాలని సూచించారు.

-------------------------

రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా ఢిల్లీలో ఈ మధ్యాహ్నం జరగనున్న "యూఎస్ న్యూక్లియర్ ఎగ్జిక్యూటివ్ డెలిగేషన్" సమావేశంలో పాల్గొంటారు. ఇంధన రంగం, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల అవకాశాలపై ఈ సమావేశంలో మంత్రి చర్చిస్తారు. అలాగే ఈ పర్యటనలో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, అంతర్జాతీయ ప్రతినిధులతో కూడా మంత్రి లోకేష్ సమావేశం అయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ఐటీ రంగ అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, నూతన ప్రాజెక్టులపై చర్చల్లో పాల్గొంటారని తెలిపారు.

-------------------------

తిరుమలకు వచ్చే భక్తుల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీస్ శాఖ అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటోందని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామిని వీఐపీ విరామ సమయంలో కుటుంబ సమేతంగా మంత్రి ఈరోజు దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ వెలుపల మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, రాష్ట్రానికి స్వామివారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తుల సురక్షిత దర్శనం కోసం భద్రతా ఏర్పాట్లు మరింత కట్టుదిట్టం చేస్తామని ఈ సందర్భంగా పేర్కొంటూ,

వాయిస్ ..30.. సెకన్లు

---

ప్రఖ్యాత ఇంజనీర్ డాక్టర్ కె.ఎల్. రావు వర్ధంతి సందర్భంగా అమరావతి సచివాలయంలో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ.. దేశ నీటి పారుదల రంగంలో కె.ఎల్.రావు చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. హీరాకుడ్, శ్రీశైలం ప్రాజెక్టు, నాగార్జున సాగర్ ప్రాజెక్టు వంటి బహుళార్ధక ప్రాజెక్టుల రూపకల్పనలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. దేశంలో 50 ఏళ్ల క్రితమే నదుల అనుసంధానాన్ని ప్రతిపాదించిన దార్శనికులు కె.ఎల్.రావు అని మంత్రి పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

---

అంతర్జాతీయ పురావస్తు ప్రదర్శనశాలల దినోత్సవాన్ని ఈరోజు జరుపుకుంటున్నాం. దేశాల సాంస్కృతిక, వారసత్వ సంపదలను కాపాడి భావితరాలకు అపురూపమైన విజ్ఞానాన్ని అందించడంలో ఇవి ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. ప్రజలకు అవగాహన కల్పించి, వాటిని మరింత ప్రోత్సహించే ఆవశ్యకతను తెలియచేసేందుకు 1977 నుంచి ప్రతీఏటా మే 18వ తేదీన ప్రపంచ పురావస్తు ప్రదర్శనశాలల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని మ్యూజియాల్లో పలు ప్రత్యేక కార్యక్రమాలు ఈరోజు నిర్వహిస్తున్నారు..

---

అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా రాష్ట్రంలోని పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ –ఏపీటీడీసీ చైర్మన్ ఎన్.బాలాజీ తెలిపారు. అంతర్జాతీయ పురావస్తు ప్రదర్శనశాలల దినోత్సవం సందర్భంగా విజయవాడ బాపు మ్యూజియంలో నిర్వహించిన మ్యూజియం డే కార్యక్రమాన్ని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశతో కలిసి ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యోద్యమ చరిత్రకు బాపు మ్యూజియం స్మారక చిహ్నమని అన్నారు. భారత జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య మహాత్మా గాంధీకి జాతీయ పతాకాన్ని అందించిన చారిత్రక ప్రదేశంగా ఈ మ్యూజియానికి ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు.

---

అంతర్జాతీయ పురావస్తు ప్రదర్శనశాలల దినోత్సవం సందర్భంగా పర్యాటక, పురావస్తు శాఖ, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం, విజయవాడ ఉత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో వారసత్వ నడక “హెరిటేజ్ వాక్” ను జిల్లా కలెక్టర్

జి. లక్ష్మీశ జెండా ఊపి ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వారసత్వ సంపదను సంరక్షిస్తూ సంస్కృతిని సజీవంగా నిలిపే నిలయాలు పురావస్తు ప్రదర్శనశాలలు అని అన్నారు.

మ్యూజియాల చారిత్రక ప్రాధాన్యతను భావితరాలకు తెలియజేసే లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేస్తూ,

వాయిస్ ..25.. సెకన్లు

---------------------------

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో ప్రస్తుతం ఉన్న 52 ఎన్నికల వార్డులను 68 వార్డులుగా పునర్విభజించేందుకు సంబంధించిన ప్రతిపాదిత ముసాయిదాను నగరపాలక సంస్థ కమిషనర్ సి. హెచ్ ఓబులేసు ఈ రోజు విడుదల చేశారు. కర్నూలులోని కమిషనర్ క్యాంపు కార్యాలయంలో ముసాయిదా ప్రతులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు వార్డుల పునర్విభజన ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. 2011 జనాభా లెక్కలు, భౌగోళిక పరిస్థితులు, పరిపాలనా సౌలభ్యం, స్థానిక అవసరాలను పరిగణనలోకి తీసుకుని ముసాయిదా రూపొందించినట్లు వివరించారు. ముసాయిదా ప్రతులపై ప్రజలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు తమ అభిప్రాయాలు, అభ్యంతరాలను ఈ నెల 24వ తేదీ సాయంత్రంలోపు వ్రాతపూర్వకంగా సమర్పించాలని కమిషనర్ కోరారు.

---------------------------

గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, ప్రజల్లో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పనే లక్ష్యంగా "జన్ భాగీదారి – జన జాగృతి" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పార్వతీపురంమన్యం జిల్లా కలెక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి తెలిపారు. పార్వతీపురంలోని కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రచార వాహనాన్ని కలెక్టర్ జెండా ఊపి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఈ నెల 25వ తేదీ వరకు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 14 మండలాల పరిధిలో ఉన్న 333 గిరిజన గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రధానమంత్రి జన్మన్ కార్యక్రమం ద్వారా గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు.

---------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వర స్వామివారి ఆర్జిత సేవా టికెట్ల ఆగస్టు నెల కోటాను తిరుమల తిరుపతి దేవస్థానం –టీటీడీ ఈ రోజు ఆన్‌లైన్‌లో విడుదల చేసింది. సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల కోసం భక్తులు ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఎలక్ట్రానిక్ డిప్‌లో నమోదు చేసుకోవచ్చని టీటీడీ తెలిపింది. ఈ నెల 21వ తేదీన కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవల టికెట్లు విడుదల చేయనుండగా, అదే రోజు మధ్యాహ్నం వర్చువల్ సేవలు, దర్శన స్లాట్లు అందుబాటులోకి రానున్నాయి.

====================